

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 26 ఫిబ్రవరి 2022 సంపుటి: 03 సంచిక: 172 పేజీలు: 4 వెల: రూ 3-00

## 'మెరిట్స్' ఆస్తులు ప్రభుత్వానికి.. గౌతమ్‌రెడ్డి పేరిట అగ్రికల్చర్ యూనివర్సిటీ



ఉదయగిరి: మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (మెరిట్స్)ను మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరుతో అగ్రికల్చర్ యూనివర్సిటీగా మార్చాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజమోహన్‌రెడ్డి కోరారు. అత్యంత విషాదకర సమయం.. తన ముద్దుల కొడుకు, మేకపాటి కుటుంబ రాజకీయ ఆశాసౌధం హఠాన్మరణం తట్టుకోలేక దుఃఖాన్ని పంటి బిగువున బిగబట్టుకున్న వేళ.. ఇంతటి బాధాతప్త సమయంలో కూడా నెల్లూరు పెద్దాయన రాజమోహన్‌రెడ్డి ఉదయగిరి, ఆత్మకూరు మెట్ట ప్రాంతాల అభివృద్ధిని మరువలేదు.బుధవారం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన మంత్రి గౌతమ్‌రెడ్డి అంత్యక్రియలకు సీఎం వైఎస్ జగన్ విచ్చేశారు. ఈ సందర్భంగా సీఎంతో పెద్దాయన మెట్ట ప్రాంత అభివృద్ధి, పలు విషయాల గురించి మాట్లాడారు. ఉదయగిరిలో వందెకరాల్లో తాను ఏర్పాటుచేసిన ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన రూ.225 కోట్ల విలువైన ఆస్తులను ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎంతో చెప్పారు. దీనికిగానూ మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరుతో అగ్రికల్చర్ యూనివర్సిటీగా మార్చాలని కోరారు. స్పందించిన సీఎం త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనే కళాశాల పేరు మార్చడంతోపాటు అగ్రికల్చర్ యూనివర్సిటీగా మార్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పెద్దాయనకు హామీ ఇచ్చారు.ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలతోపాటు గతంలో తాను ప్రాతినిధ్యం వహించిన ఒంగోలు మెట్ట ప్రాంతాలకు తాగు, సాగునీరందించే వెలుగొండ ప్రాజెక్టు, సోమశిల హై లెవెల్ కెనాల్,

### సీఎం వైఎస్ జగన్‌ను కోరిన రాజమోహన్‌రెడ్డి
### 'మెరిట్స్' ఆస్తులను ప్రభుత్వానికి అప్పగిస్తానని వెల్లడి
### వచ్చే అసెంబ్లీ సమావేశంలో చర్యలు తీసుకుంటామని హామీ


ఫేజ్?1, ఫేజ్?2లను పూర్తి చేసి త్వరగా డెల్టాగా మార్చాలని రాజమోహన్‌రెడ్డి కోరారు. వెలుగొండ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు.వెంకటాచలం: మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డికి గురువారం ఘన నివాళులర్పించారు. వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి, రెక్టార్ ఎం.చంద్రయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి తదితరులు గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వం కలిగిన గౌతమ్‌రెడ్డి అకాల మరణం చాలా బాధాకరమన్నారు.రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడు, వ్యాపారవేత్త అయిన వ్యక్తి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. అనతికాలంలోనే పలు అంతర్జాతీయ సంస్థలు, పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఆయన అకాలమరణం రాష్ట్రానికి తీరనిలోటని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ సాయిప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుజయ్‌కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉక్రెయిన్ లో ఉన్న ఏపీ విద్యార్థులను తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టిగా ప్రయత్నిస్తోంది..: సోము వీర్రాజు

ప్రకాశం: ఉక్రెయిన్?లో చిక్కుకున్న ఏపీ విద్యార్థులను తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టిగా ప్రయత్నం చేస్తోందని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రాంతీయ పార్టీలు దేశాన్ని సర్వనాశనం చేస్తున్నాయని ఆరోపించారు. టీటీడీ వంటి ధార్మిక సంస్థలను ప్రభుత్వం వ్యాపార ధోరణితో చూడటం దౌర్భాగ్యమన్నారు. రాజధానిని అమరావతిలోనే ఉంచాలన్నారు. అమరావతి కోసం కేంద్రం చాలా ప్రాజెక్టులు మంజూరు చేసిందన్నారు. కేంద్ర బడ్జెట్?లో గ్రామం నుండి మున్సిపాలిటీ, కార్పొరేషన్ వరకూ అభివృద్ధి నిధులు కేటాయిస్తుందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి అన్యాయం జరిగిందని కేంద్రం భావిస్తోందని సోము వీర్రాజు తెలిపారు. కేంద్రం ప్రభుత్వానికి ఇచ్చిన రూ. 25వేల కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్?కు అయ్యే ఖర్చును కేంద్రం ఇప్పటికే ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల రూపంలో ఇచ్చినట్లు సోమువీర్రాజు వెల్లడించారు.

## పుతిన్ తో మాట్లాడిన ప్రధాని

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25, (న్యూస్ పల్స్)ఉక్రెయిన్‌పై యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్ లో మాట్లాడారు. యుద్ధం ఆపాలని ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడిని కోరారు. చర్చల ద్వారా సామరస్యంగా సమస్యను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. యుద్ధం కారణంగా ఉక్రెయిన్ లో నెలకొన్న దీన పరిస్థితులను మోడీ పుతిన్ కు వివరించారు. ఉక్రెయిన్‌లో నివసిస్తోన్న భారతీయ విద్యార్థుల క్షేమం గురించి ఆలోచించాలని కోరారు. కాగా మొదటి నుంచి భారత్‌కు రష్యా మిత్రదేశంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వెంటనే యుద్ధాన్ని నిలిపేయాలని పుతిన్‌ను ప్రధాని కోరడం చర్చనీయంశంగా మారింది. అయితే పుతిన్ యుద్ధం కొనసాగింపునకే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌పై దాడి చేయడానికి దారి తీసిన పరిస్థితులను పుతిన్ మోడీకి వివరించారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తటస్థ వైఖరిని అవలంభిస్తుందని భారత విదేశాంగశాఖ గురువారం ఉదయం ప్రకటించిన సంగతి తెలిసిందే. శాంతియుత మార్గాల ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం కోరుకుంటున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో ఉన్న భారతీయుల భద్రత పైనే ప్రధాన దృష్టి సారించినట్లు విదేశాంగ శాఖ చెప్పుకొచ్చింది. అయితే ఇంతలోనే మోడీ పుతిన్‌కు ఫోన్ చేసి యుద్ధం ఆపమనడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనికంటే ముందే మరోవైపు ఉక్రెయిన్- రష్యా యుద్ధం కారణంగా దేశంపై ప్రతికూల ప్రభావం పడకుండా నరేంద్ర మోడీ గురువారం మధ్యాహ్నం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి జయశంకర్‌తో పాటు జాతీయ భద్రతా సలహాదారు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తాజా పరిణామాలు, ముడి చమురు ధరలు తగ్గించే మార్గాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.



## కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు సీఎం జగన్ ఫోన్



తాడేపల్లి: ఉక్రెయిన్‌లో ఉన్న తెలుగు వారిని క్షేమంగా తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు ఇప్పటికే లేఖ రాసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా ఆయనకు ఫోన్ చేశారు. ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన తెలుగు విద్యార్థులను క్షేమంగా తీసుకురావడంపై కేంద్ర మంత్రితో చర్చించారు. ఈ మేరకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రం అన్నిరకాలుగా చర్యలు తీసుకుంటోందని జైశంకర్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న విద్యార్థులను ముందుగా పక్కదేశాలకు తరలించి అక్కడ నుంచి ప్రత్యేక విమానాల ద్వారా చర్యలు తీసుకొచ్చే దిశగా ముమ్మర చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా.. జైశంకర్‌కు ఫోన్ చేసే ముందు ఉక్రెయిన్‌లో చిక్కుకున్న తెలుగువారిని భద్రంగా రప్పించడంపై సీఎం వైఎస్ జగన్ ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉన్నతస్థాయి సమావేశంలో సీఎస్, సీఎంఓ అధికారులు, సలహాదారు జితేష్ శర్మ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో ఇప్పటివరకూ తీసుకున్న చర్యలను అధికారులు సీఎంకు వివరించారు.అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న సీఎం జగన్ కలెక్టర్ల స్థాయిలో కాల్‌సెంటర్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రానికి చెందిన ప్రతి ఒక్కరితో కమ్యూనికేషన్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వారి యోగక్షేమాలను కనుక్కుంటూ వారి భద్రతకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు వారితో సంప్రదిస్తూ తగిన మార్గనిర్దేశం చేయాలని, కేంద్ర ప్రభుత్వాధికారులకు అవసరమైన సమాచారాన్ని అందించాలని సీఎం పేర్కొన్నారు.ఉక్రెయిన్‌లో ఉన్న తెలుగువారి నుంచి ఎలాంటి సమాచారం వచ్చినా దాన్ని విదేశాంగశాఖ అధికారులకు చేరవేయాలని తెలిపారు. అవసరమైతే ప్రత్యేక విమానాల ద్వారా తరలింపులో రాష్ట్రం నుంచి తగిన సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇక ఇప్పటికే ఉక్రెయిన్‌లో ఉన్న తెలుగు వారిని క్షేమంగా తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని విదేశాంగ శాఖ మంత్రికి కూడా సీఎం జగన్ లేఖ రాసిన సంగతి తెలిసిందే.

## ఉక్రెయిన్‌లో తెలుగు విద్యార్థులు..

### ఏపీ, తెలంగాణ నుంచి హెల్ప్‌లైన్ నెంబర్లు ఇవే





ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో.. అక్కడున్న ఇతర దేశాల పౌరుల భద్రతపై భయాందోళనలు నెలకొన్నాయి. సంక్షోభ సమయం నుంచి ఇప్పటి వరకు చాలామంది ఉక్రెయిన్‌ను వీడగా.. పరిస్థితి ఇక్కడిదాకా వస్తుందని ఊహించని వాళ్లు.. ప్రత్యేకించి విద్యార్థులు తరగతుల నేపథ్యంలో అక్కడే చిక్కుకుపోయారు. ఈ పరిణామాల నడుమ.. తెలుగు రాష్ట్రాల విద్యార్థులను సురక్షితంగా రప్పిస్తామని తల్లిదండ్రులకు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు భరోసా ఇస్తున్నాయి.

ఉక్రెయిన్‌లో చిక్కుకున? తెలుగు విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించింది. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న తెలుగు విద్యార్థుల భద్రతపై ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సీఎస్ సమీర్ శర్మ, సీఎంఓ అధికారులు, సలహాదారు జితేష్ శర్మ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మరోవైపు ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన విద్యార్థులను సురక్షితంగా రప్పించే విషయమై కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సీఎం వైఎస్ జగన్ ఫోన్ చేసి మాట్లాడారు. తగిన చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ కోరగా.. కేంద్రం అన్నిరకాలుగా చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా వివరించారు జైశంకర్. అనంతరం ప్రత్యేక హెల్ప్‌లైన్‌లపై అధికారులకు సూచనలు చేశారు.

హెల్ప్‌లైన్ నెంబర్: 0863-2340678
ఏపీ హెల్ప్‌లైన్ వాట్సాప్ నెంబర్ +918500027678
ఢిల్లీలో సంప్రదించాల్సిన అధికారులు:
శివ శంకర్- 9871999055
రామారావు-9871990081
సాయిబాబు- 9871999430

ఉక్రెయిన్‌లోని వార్ జోన్‌లో చిక్కుకుపోయిన పిల్లల తల్లిదండ్రులు విశాఖపట్నంలోని సర్క్యూట్ గెస్ట్ హౌస్‌లో రాజ్యసభ ఎంపీ విజయసాయి రెడ్డిని కలిశారు. వారి సమస్యలను విని విదేశాంగ మంత్రి జైశంకర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అండగా ఉంటామని హామీ ఇచ్చారు విజయసాయి రెడ్డి. అంతేకాదు ఉక్రెయిన్‌లోని తెలుగు ప్రజలు 9871999055 ఒ 7531904820 ద్వారా సాయం కోరవచ్చని రాజ్యసభ ఎంపీ విజయసాయి రెడ్డి ట్విటర్ ద్వారా తెలిపారు.

## మంత్రులు పేర్నినాని, కొడాలి నానిలకు పవన్ అభిమానుల సెగ

విజయవాడ: రాష్ట్ర మంత్రులు పేర్ని నాని, కొడాలి నానిలకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానుల సెగ తగిలింది. కృష్ణా జిల్లా గుడివాడలో జి3 భాస్కర్ థియేటర్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కొడాలి నాని,పేర్ని నాని పాల్గొన్నారు. ప్రారంభ చిత్రంగా థియేటర్లో భీమ్లా నాయక్ ప్రదర్శించనున్నారు. కాగా థియేటర్ వద్ద మంత్రి పేర్ని నానిని అడ్డుకునేందుకు పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన పార్టీ నాయకులు ప్రయత్నించారు. జై పవన్ కళ్యాణ్, ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని పెద్ద పెట్టున అభిమానులు నినాదాలు చేశారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు గుడివాడ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పలువురు అభిమానులను అరెస్ట్ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పవన్ కళ్యాణ్ సినిమాలను వేధించడం దుర్మార్గమని అభిమానులు మండిపడుతున్నారు.

## ఆ పని చేస్తే కనుక ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధమే: రష్యా కీలక వ్యాఖ్యలు



కీవ్: రష్యా దళాలు ఉక్రెయిన్‌పై విరుచుకుపడుతూ రాజధాని కీవ్‌కు దాదాపు సమీపించిన వేళ రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్‌రోవ్ కీలక ప్రకటన చేశారు. ఉక్రెయిన్ ఆర్మీ కనుక ఆయుధాలు విడిచిపెడితే చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈశాన్య, తూర్పు వైపుల నుంచి రష్యా సైన్యం కీవ్‌ను చుట్టుముడుతున్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంతకుముందు ఉక్రెయిన్ ప్రధానమంత్రి డెనిస్ ష్మిహాల్ మాట్లాడుతూ.. చెర్నోబిల్ ఎక్స్‌క్లూజన్ జోన్, చెర్నోబిల్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను రష్యన్ సేనలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మీడియా కథనాలను బట్టి ఉక్రెయిన్ ఇక రష్యా చేతికి చిక్కినట్లేనని తెలుస్తోంది.కీవ్‌లోకి రష్యన్ బలగాలు ఇప్పటికే చేరుకున్నాయని, మరో నాలుగు రోజుల్లో ఉక్రెయిన్ పూర్తిగా రష్యా వశమవుతుందని తెలుస్తోంది. ఉక్రెయిన్‌లో తనకు అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పుతిన్ భావిస్తున్నట్లు సమాచారం.

### టికెట్ల ధరలపై కమిటీ వేశాం.. ఇంకా నివేదిక రాలేదు: మంత్రి బొత్స

విజయనగరం: సినిమా టికెట్స్ అంశం ఇంకా కొనసాగుతోంది. ఇదే విషయంపై మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ టికెట్ల ధరలపై కమిటీ వేశామని, ఇంకా నివేదిక రాలేదని తెలిపారు. మనం ఒక వ్యవస్థలో ఉన్నాం... దానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. వ్యక్తుల కోసం కాదు.. ప్రజల కోసం ఆలోచన చేయాలని హితవుపలికారు. టికెట్లు ధరలు నచ్చకపోతే సినిమాను వాయిదా వేసుకోవాలన్నారు. అమరావతి రైతులది రాజకీయ ఉద్యమమని బొత్స సత్యనారాయణ విమర్శించారు.

## అగ్రిగోల్డ్, అక్షయ గోల్డ్ కేసుల్లో కీలక మలుపు

హైదరాబాద్: అగ్రిగోల్డ్, అక్షయ గోల్డ్ కేసుల్లో కీలక మలుపు చోటు చేసుకుంది. అగ్రిగోల్డ్, అక్షయగోల్డ్ కేసులను ఏపీలోని ఏలూరు కోర్టుకు బదిలీ చేసింది తెలంగాణ హైకోర్టు. ఏడేళ్లుగా హైకోర్టులో అగ్రిగోల్డ్, అక్షయగోల్డ్ వివాదాలు కొనసాగుతుండగా, వాటిని ఏలూరు కోర్టుకు బదిలీ చేస్తున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది. కాగా, హైకోర్టులోనే విచారణ కొనసాగించాలన్న డిపాజిటర్ల, బ్యాంకుల అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది.అదే సమయంలో వేలం ద్వారా వచ్చిన రూ. 50 కోట్లను కూడా ఏలూరు కోర్టుకే బదిలీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ఆదేశాలను పరిగణలోకి తీసుకోవాలని ఏలూరు కోర్టుకు ఆదేశాలు జారీ చేసింది. ఏపీ డిపాజిటర్ల రక్షణ చట్టం ప్రకారం ఏలూరు కోర్టుకే విచారణాధికారం ఉందని హైకోర్టు పేర్కొంది.



# సంపాదకీయం

శనివారం 26 ఫిబ్రవరి 2022

## రష్యా ఉక్రెయిన్ యుద్ధం.. భారత్ పై ప్రభావం

ఉక్రెయిన్-రష్యాల మధ్య జరుగుతున్న యుద్ధ పరిణామాల ప్రభావం భారత్‌కు తాకనుంది. దేశీయంగా కొన్ని వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా సన్‌ఫ్లవర్ నూనె గత సంవత్సరం మన దేశం1.89 మిలియన్ టన్నుల నూనెను దిగుమతి చేసుకుంది. అందులో 70 శాతం ఉక్రెయిన్ 20 శాతం రష్యా నుంచి వచ్చింది. మరో 10 శాతం అర్జెంటీనా నుంచి దిగుమతి చేసుకుంది భారత్. నెలకు 2 నుంచి 3 లక్షల టన్నుల ఈ సన్‌ఫ్లవర్ నూనె దిగుమతి చేసుకుంటోంది. ఫిబ్రవరిలో ఉక్రెయిన్ నుంచి సరఫరా నిలిచిపోయింది. తీవ్ర ఉద్రిక్తతలు మరో రెండు, మూడు వారాలు ఇలాగే కొనసాగితే భారత్‌కు తీవ్రమైన ఇబ్బంది కలుగనుంది. ఆయిల్ కొరత తీవ్రంగా ఏర్పడే అవకాశం ఉంది.రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు అనూహ్యంగా పెరిగాయి. మార్కెట్‌లో బ్యారెల్ చమురు ధరలకు 100 డాలర్లకు చేరుకుంది. పెరుగుతున్న ముడిచమురు ధరలు భారతదేశంలోని విధాన నిర్ణేతలకు తలనొప్పులు తీసుకువస్తున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఆర్థిక వ్యవస్థపై ధరల పెరుగదల ప్రభావంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియా తన చమురు అవసరాలలో 80 శాతం దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. ఇక ఎనిమిదేళ్ల తర్వాత మరోసారి ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు చేరుకుంది.ముడిచమురు ధరను బ్యారెల్‌కు 75 డాలర్లుగా ఉంచి లెక్కిస్తే బడ్జెట్‌కు ఏం జరుగుతుందో ఒక్కసారి ఊహిస్తే భయం కలుగుతుంది. ఎందుకంటే ఈ పరిస్థితుల్లో సమీప భవిష్యత్తులో కూడా ధరలు తగ్గే అవకాశం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే ఇకపై ధరలు పెరగుతూనే ఉంటాయి. ప్రపంచ చమురు మార్కెట్‌లో రష్యా ఆధిపత్యం చెలాయిస్తున్నందున ఇలాంటి అంచనాలకు రాక తప్పడంలేదు. ఎందుకంటే రష్యా ప్రపంచంలో రెండో అతిపెద్ద చమురు ఎగుమతిదారు.ముడి చమురును ఉత్పాత్తి చేసే దేశాల్లో ప్రపంచంలో మూడో స్థానం రష్యాదే! రష్యా ప్రతి రోజు 5 మిలియన్ బ్యారెల్ల ముడి చమురును ఎగుమతి చేస్తుంది. యూరప్‌లో 48 శాతం, ఆసియాలో 42 శాతం దేశాలు ముడి చమురు అవసరాలకు రష్యాపై ఆధారపడ్డాయి. అందువల్ల రష్యా నుంచి ముడి చమురు దిగుమతి ఒక ప్రధాన అంశంగా మారిపోయింది. ప్రస్తుతం చమురును ఎగుమతి చేసే దేశాల్లో సౌదీ అరేబియా ప్రపంచంలోనె మొదటి స్థానంలో ఉంది.ఒపెక్ కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించడానికి సౌదీ అరేబియా అంగీకరించడం లేదు. ముడి చమురు ఉత్పత్తిని పెంచడానికి ఒప్పుకోవడం లేదు. దీని అర్థం ఆసియా, యూరప్‌లో ధరలు పెరుగుతాయి. ఈ పరిస్థితి దేశాలకు పెద్ద తలనొప్పి, కానీ దీనివలన చమురు ఆర్థిక వ్యవస్థలు చాలా ప్రయోజనం పొందుతాయి. ముడి చమురుతో పాటు, గ్యాస్ ధరలు కూడా ఎప్పుడైనా ఆకాశాన్ని తాకొచ్చు. ఒకవైపు చలికాలం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండడంతో పశ్చిమ దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. మరోవైపు, తక్కువ ఇన్వెంటరీ సహజ వాయువు ధరలను పెంచుతోంది. ఇప్పుడు గ్యాస్ మార్కెట్‌పై రష్యా భారీ ప్రభావం చూపుతున్నందున పరిస్థితి క్లిష్టంగా మారొచ్చని తెలుస్తోంది. అటువంటి ఊహాగానాలకు మరింత బలం చేకూర్చే కొన్ని అంశాలను చూద్దాం. రష్యా 2020లో 22 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల కంటే ఎక్కువ సహజ వాయువును ఉత్పత్తి చేసింది. 8.5 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల సహజ వాయువును ఎగుమతి చేసింది. యూరప్, యూరో ఆసియా దేశాలు ఈ గ్యాస్ ఎగుమతిలో దాదాపు 90 శాతం కొనుగోలు చేశాయి. జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, బెలారస్ ఎగుమతుల్లో సగానికి పైగా కొనుగోలు చేయడం అనేది యూరప్ తన గ్యాస్ అవసరాలను తీర్చడానికి రష్యాపై ఆధారపడటాన్ని చూపిస్తుంది. అందుకే, రష్యా, ఉక్రెయిన్ సంక్షోభం ఐరోపాకు తీవ్రమైన సమస్య మారింది. గత 2 నెలల్లో గ్లోబల్ మార్కెట్‌లో గ్యాస్ ధర మూడింట ఒక వంతు పెరిగింది. డిసెంబరు చివరి నాటికి గ్యాస్ ధరలు యూనిట్‌కు 3.54 డాలర్ల నుంచి 4.86 డాలర్లకు పెరిగాయి. రష్యా చమురు, గ్యాస్‌లో మాత్రమే కాకుండా బొగ్గు, అణుశక్తిలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. దీని అర్థం రష్యా ప్రపంచ ఇంధన మార్కెట్ చక్రాన్ని తిప్పుతుంది. పుతిన్ దానిని తన సొంత ప్రయోజనం కోసం ఉపయోగించుకుంటున్నారు. ప్రశాంతంగా జీవించడానికి ఇష్టపడే భారతీయులు ఇప్పుడు ఖరీదైన ఆయిల్‌తోపాటు తాజా ఇబ్బందులను కూడా దిగుమతి చేసుకునే పరిస్థితి. క్షీణిస్తున్న రూపాయితో ఖరీదైన చమురును కొనుగోలు చేయడం దేశానికి చాలా ఖర్చుతో కూడుకున్నది. మార్చి 7న 5 రాష్ట్రాల్లో ఎన్నికలు ముగియనున్న నేపథ్యంలో పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు భారీగా పెరగనున్నాయి. ప్రభుత్వానికి పరిమితమైన అవకాశాలే ఉన్నాయి. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఇప్పటికే భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఇటువంటి సవాళ్లను స్వీకరించే సామర్థ్యం బడ్జెట్‌కు లేదు. దీని వలన మన ప్రజలు చమురు ద్రవ్యోల్బణాన్ని చాలా కాలం పాటు ఎదుర్కోవాల్సి ఉంటుంది.ఇక గోధుమలు అధికంగా వినియోగించే దేశాల్లో భారత్ కూడా ఉంది. ప్రపంచ ఎగుమతి చేసే దేశాల్లో రష్యా అగ్రగామిగా ఉంది. గోధుమల అతిపెద్ద నాలుగో ఎగుమతిదారుగా ఉక్రెయిన్ ఉంది. నల్ల సముద్రం ప్రాంతం నుంచి అధికంగా గోధుమలు సరఫరా అవుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతల వల్ల వీటి సరఫరా నిలిచిపోయినట్లయితే గోధుమల ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇండియా వద్ద 24.2 మిలియన్ టన్నుల నిల్వలు ఉండటంతో దేశీయ ఎగుమతిదారులు దీనిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని విశ్లేషకులు చెబుతున్నారు.ఇక మొబైళ్లలో తయారీలో వినియోగించే లోహం పల్లాడియం అతిపెద్ద ఎగుమతిదారుగా రష్యా ఉంది. రష్యాపై పలు దేశాలు ఆంక్షలు విధిస్తున్న నేపథ్యంలో పల్లాడియం ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉంది.భారత్ నుంచి టీ అధికంగా కొనుగోలు చేసే దేశాల్లో రష్యా రెండ స్థానంలో ఉంది. మన ఎగుమతుల్లో 18 శాతం ఆ దేశానికి వెళ్తాయి. తాజాగా తలెత్తుతున్న పరిణామాల నేపథ్యంలో టీ ఉత్పత్తిదారులు, ఎగుమతి దారులు ఆందోళన చెందుతున్నారు. రష్యాపై విధించిన ఆంక్షలతో చెల్లింపుల విషయంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని భావిస్తున్నారు

# శ్రీశైలంలో ఘనంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సంబరాలు అంబరాన్నంటాయి మూడోవరోజు గురువారం రాత్రి శ్రీ భ్రమరాంబ సమేతుడైన మల్లికార్జునస్వామి హంసవాహనాదీశులై భక్తులకు దర్శనమిచ్చారు శ్రీశైలం ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపకాంతులతో భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్చకులు,వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో హంసవాహనంలో ఆవహింపజేసి అర్చకస్వాములు వాహన పూజలు నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చారు అనంతరం స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులను విద్యుత్ దీప కాంతుల నడుమ కన్నులపండువగా

**హంసవహనంపై దర్శనమిచ్చిన ఆది దంపతులు**

గ్రామోత్సవానికి తరలివెళ్లారు రాజగోపురం గుండ హంసవాహనాదీశులైన స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా బాజా బజంత్రీల నడుమ బ్యాండ్ వాయిద్యాలతో అంగరంగ వైభవంగా శ్రీశైలం పురవీధుల్లో విహరిస్తుండగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కనులారా దర్శించుకుని కర్పూర నీరాజనాలర్పించారు ఉత్సవమూర్తుల ముందు కళాకారుల ఆటపాటలు నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి ఈ పూజకైకర్యాలలో ఆలయ ఈవో లవన్న దంపతులు పాల్గొన్నారు....

# ఆందోళన వద్దు- అన్ని చర్యలూ తీసుకొంటున్నాం..

శ్రీశైలం ఉన్నత చదువుల నిమిత్తం ఉక్రెయిన్ వెళ్లి రష్యాతో యుద్ధం కారణంగా అక్కడే చిక్కుకుపోయిన శ్రీకాకుళం జిల్లాతో పాటు ఉత్తరాంధ్రకు చెందిన విద్యార్థుల గురించి వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని వారిని సురక్షితంగా వెనక్కు రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఉక్రెయిన్లో చదువుతున్న ఏపీ విద్యార్థుల రక్షణకు ఏర్పాట్లు చేయించడంతో పాటు అక్కడి నుంచి క్షేమంగా వారిని రప్పించడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కేంద్రాన్ని కోరారని, విదేశాంగ శాఖ మంత్రికి లేఖ కూడా రాశారని చెప్పారు. కేంద్రం కూడా వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేసిందన్నారు.ఇప్పటికే ఏపీఎన్ఆర్టీఎస్ ద్వారా ఆయా విద్యార్థులకు కావలసిన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్లో నోడల్ అధికారిని, విదేశాంగ శాఖతో

**- ఉక్రెయిన్లోని విద్యార్థుల భద్రతపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ**

**- తల్లిదండ్రులు ధైర్యంతో ఉండాలి**

**-డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్**

ఎప్పటికప్పుడు సంప్రదింపులకు వీలుగా ప్రత్యేక ప్రతినిధిని ఏర్పాటుచేశామని తెలిపారు. ఉక్రెయిన్లోని ఏపీ విద్యార్థులతో ఇప్పటికే నేరుగా మాట్లాడి వారికి ధైర్యం చెప్పామన్నారు. అక్కడి భారత ఎంబసీ కూడా విద్యార్థులకు అనేక సూచనలు అందించిందని, వాటి ప్రకారం నడచుకోవాలని తెలిపామన్నారు. సీఎం వైఎస్ జగన్ ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించారని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని మీ పిల్లల్ని సురక్షితంగా స్వస్థలాలకు రప్పించడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఎవరూ ధైర్యాన్ని కోల్పోవద్దని విజ్ఞప్తి చేశారు.

# అప్పుడే నాకు అనుమానం వచ్చింది

**అవినాష్ రెడ్డి పెదనాన్న**

కడప, ఫిబ్రవరి 25, (న్యూస్ పల్స్)మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డి పెదనాన్న వైఎస్ ప్రతాప్‌రెడ్డి.. సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలం వెలుగులోకి వచ్చింది. 2021 ఆగస్టు 16న సీబీఐకి ఆయన తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. వివేకా రక్తపు వాంతులతో చనిపోయినట్లు వైఎస్ మనోహర్‌రెడ్డి చెప్పారని ఆయన అన్నారు. వివేకా బెడ్, నేలపై రక్తపు మరకలు చూశానని, బెడ్‌రూమ్‌లో దేవిరెడ్డి శంకర్‌రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, కృష్ణారెడ్డి, ఇనయతుల్లా ఉన్నారని సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో వెల్లడించారు. బాత్‌రూమ్‌లో రక్తపు మరకల మధ్య వివేకా మృతదేహం ఉందన్నారు. వివేకా గుండెపోటుతో మృతి చెందినట్లు అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి చెప్పారని, కానీ అది గుండెపోటుతో మృతి చెందినట్లు లేదని తాను గ్రహించానని వెల్లడించారు. పనిమనిషితో రక్తపు మరకలు శుభ్రం చేయిస్తుంటే అనుమానం వచ్చిందని, రక్తపు మరకలను శంకర్‌రెడ్డి, ఎర్రగంగిరెడ్డి శుభ్రం చేయించారని తెలిపారు. కడప ఎంపీ టికెట్ తనకు ఇవ్వకున్నా పర్లేదని వివేకా చెప్పారని వాంగ్మూలంలో పేర్కొన్నారు. తనను కాదంటే టికెట్‌ను షర్మిల, విజయమ్మకు ఇవ్వాలని ఆయన కోరారన్నారు.వివేకానందరెడ్డి ఇంట్లోని బెడ్ రూంలోకి వెళ్ళి చూసేసరికి, అప్పటికే దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, కృష్ణారెడ్డి, ఇనయతుల్లా అక్కడ ఉన్నారు. బెడ్‌మీద, నేలపైన రక్తపు మరకలు ఉన్నాయి. బాత్ రూంలో వివేకా మృతదేహం కనిపించింది. అక్కడి పరిస్థితులను చూస్తే గుండెపోటు కాదని, ఏదో జరిగిందని నాకు అర్థమైంది. అవినాశ్‌రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి దగ్గరుండి పని మనిషితో రక్తపు మరకలను శుభ్రం చేయించారు. సాక్ష్యాధారాలను ఎందుకు చెరిపేస్తున్నారని సీఐ ప్రశ్నించినా వాళ్లు పట్టించుకోలేదు.

# అన్నమో... వెంకటేశ అంటున్న భక్తులు

తిరుమల, ఫిబ్రవరి 25, (న్యూస్ పల్స్) తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆర్జిత సేవల టికెట్ల ధరలను భారీగా పెంచేసింది టీటీడీ. దీంతో శ్రీవారి క్షేత్రాన్ని వ్యాపార సంస్థగా మార్చేసిందనే ఆరోపణల జడివానను ఎదుర్కొంది. ఇప్పుడు తిరుమలలో ప్రైవేట్ హ్పటళ్లను రద్దు చేసింది. కొండకు వచ్చే భక్తులకు భోజన సదుపాయం లేకుండా చేసింది. శ్రీవారి అన్న ప్రసాదం ఉచితంగా అందిస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న టీటీడీ పాలకమండలి తిరుమలకు పోటెత్తి వచ్చే భక్తులను గంటల తరబడి క్యూలైన్లలో నిలబెడుతోంది. ఇంతకు ముందు అన్న ప్రసాదం క్యూలైన్లో నిలబడే ఓపిక, సమయం లేని అనేక మంది భక్తులు ప్రైవేట్ హ్పటళ్లలో కూడా భోజనం చేసేవారు. వారికి ఆ సౌకర్యం లేదకుండా చేయడంతో భక్తులు ఒక పక్క లబోదిబోమంటూనే.. మరో పక్కన టీటీడీ పాలక మండలి నిర్ణయాన్ని తూర్పారపడుతున్నారు. టీటీడీ దుందుడుకు నిర్ణయం కారణంగా తిరుమలగిరుల్లో గోవింద నామాల కన్నా అన్నమో రామచంద్రా నినాదమే మారుమోగుతోంది.

# ప్రభుత్వ స్థలాల్లో చేసుకున్న అగ్రిమెంట్లు చెత్తకాయితం తో సమానం

**బద్వేలు ఆర్డీవో ఆకుల వెంకటరమణ**

**మున్సిపాలిటీ అభివృద్ధికి 130 కోట్లు ప్రభుత్వం ఆమోదం**

**మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి**



బద్వేలు ఉదయం ప్రతినిధిప్రభుత్వ స్థలాల్లో చేసుకున్న అగ్రిమెంట్ కాయితాలు చెత్తబుట్టలో వేసుకోడానికి తప్ప ఎందుకు పనికి రావని బద్వేల్ ఆర్డిఓ ఆకుల వెంకటరమణ స్పష్టం చేశారు బద్వేల్ రెవెన్యూ డివిజన్ లోని పలు మండలాల్లో భూకబ్జాలు ఆక్రమణలు ఎక్కువయ్యాయని అగ్రిమెంట్ ల రూపంలో వీటిని ఇతరులకు కట్టబెడుతున్నారని ఇవి ఏమాత్రం చెల్లవని ఆయన పేర్కొన్నారు శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో బద్వేల్ మున్సిపల్ ప్రత్యేక సమావేశం జరిగింది సమావేశానికి చైర్మన్ రాజగోపాల్ రెడ్డి అధ్యక్షత నిర్వహించారు ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూ కబ్జాలపై తనకు ప్రతిరోజు ఫిర్యాదులు వస్తున్నాయని వీటిని అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు గతంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల పట్టాలు కూడా విక్రయాలు జరుగుతున్నాయని ఇలా చేయడం చట్ట వ్యతిరేకమన్నారు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి ఇంటి స్థలాలు వంద రూపాయల స్టాంపు అగ్రిమెంట్ ల మీద రాసుకున్న అవి ఏమాత్రం చెల్లవని ఆర్ డి ఓ మరి మరి స్పష్టం చేశారు ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలాలు పొందినవారు వారు ఇల్లు కట్టుకొని అనుభవించాలే తప్ప ఇతరులకు ఏమాత్రం విక్రయించ కూడదని ఆర్డిఓ పేర్కొన్నారు ప్రభుత్వ భూముల్లో స్థలాల్లో అనుమతులు లేకుండా ఎటువంటి నిర్మాణాలు జరిగిన వాటిని అడ్డుకుంటామని ఆయన తెలిపారు అలాగే యంత్రాలను కూడా సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు పఈ విషయంలో ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు కొన్నిచోట్ల రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని కౌన్సిలర్ లతోపాటు తో ప్రజలు కూడా ఫిర్యాదులు చేస్తున్నారని ఆర్డిఓ4:52 ఖఓ, 2/25/2022ె +91 94928 37359: అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రతిపక్షాలు సమిష్టి కృషితోనే ఏదైనా అభివృద్ధి చేయవచ్చునని బద్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డులో మున్సిపాలిటీ కౌన్సిలర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బద్వేల్ ఆర్డీవో ఆకుల వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ బద్వేల్ అభివృద్ధికి 130 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఈ నిధుల విడుదలకు ఆమోదం కూడా వచ్చిందని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని ఒక వారంలో అన్ని రకాల అనుమతులు వస్తాయని అన్నారు. ముఖ్యంగా బద్వేలు లో పందుల సంచారం ఎక్కువగా ఉందని వాటి నివారణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే రేషన్ బియ్యం పంపిణీ లో అవకతవకలు జరుగుతున్నాయని , ముఖ్యంగా గోపవరం మండలంలో రేషన్ బియ్యం సరఫరాలో అంతరాయం తో పాటు అవకతవకలు కూడా జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిందని, రేషన్ బియ్యం సక్రమంగా సరఫరా చేయడం లేదని వాదనలు వినవస్తున్నాయి అని సభలో చర్చించారు. కౌన్సిల్ అందరూ చిత్తశుద్ధితో బేధాభిప్రాయాలు లేకుండా పనిచేయాలని ఆయా వార్డులోని సమస్యలను గుర్తించి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యల తీర్చాల్సిన బాధ్యత ఆ వార్డు కౌన్సిలర్ ల పైనే ఉందని అన్నారు. అనంతరం ఆర్డీవో వెంకటరమణ మాట్లాడుతూ వార్డులలో జీవన ప్రమాణాల స్థాయి పెంచాలని, ప్లాస్టిక్ నివారణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిరుపేదలను గుర్తించి ప్రభుత్వం అందించే పథకాలు వారికే అందేలా వార్డు కౌన్సిలర్ లే గుర్తించి పథకాలు అందే విధంగా చేయాలని పేర్కొన్నారు.



# విశాఖలో భీమ్లా హల్ చల్

విశాఖపట్నంఈ సమ్మర్లో టాలీవుడ్ బాక్స్ ఆఫీస్ కు కరోనా వైరస్ పేరుతో పట్టిన దుమ్ము దులిపేందుకు స్టార్ హీరోలందరూ కూడా సిద్ధమైపోయా రు.ఈ క్రమంలోనే వరుసగా సినిమాల ను విడుదల చేసేందుకు రెడీ అయ్యా రు.పరిస్థితులు అనుకూలించక వాయి దా పడుతూ వస్తున్న బీమ్లానాయక్ పవన్ మూవీ ఎట్టకేలకు విడుదల కావడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతు న్నారు.ముఖ్యంగా అందరి కంటే ముందు అటు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భీమ్లా నాయక్ సినిమాతో ప్రేక్షకులను పలకరించడంతో పవర్ స్టార్ మూవీకి గ్రాడ్ గా వెల్ కమ్ చెప్పారు.విశాఖలో పలు థియేటర్ వద్ద పవన్ కళ్యాణ్ కటౌట్ ఏర్పాటు చేసి సందడి చేశారు.

# మిలన్ 2022 అంతా సిద్ధం

**ముస్తాబవ్వుతున్న విశాఖ బీచ్**

విశాఖపట్నం ఏపీ విశాఖలో సందడి వాతావరణం నెలకొంది. బీచ్ రోడ్లో అన్ని ప్రధాన దర్శనీయ స్థలాలను చూపరులకు కనువిందు చేసేట్టుగా తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 27న జరిగే అంతర్జాతీయ సిటీ పరేడ్, నౌకా దళ విన్యాసాల కోసం సిద్ధమవు తున్న ఈ ఏర్పాట్లు కొత్త సొబగులను అద్దు తోంది.ఈనెల 27న జరగనున్న బహు ళ దేశాల నేవీ విన్యాసం-మిలన్ 2022 కోసం విశాఖ బీచ్ రోడ్ కొత్త రూపు దిద్దుకుంటోంది. సముద్రంపై జరిగే విన్యాసాలు బీచ్ రోడ్లో జరిగే పరేడ్ ను వీక్షించేందుకు వచ్చే వారికి ఈ ప్రాంతమంతా సరికొత్తగా కన్పించ నుంది. టీయూ-142 మ్యూజియం, కురుసుర సబ్ మెరైన్ మ్యూజియం, విక్టరీ ఎట్ సీ వంటివే కాకుండా సాగర తీరంలో ప్రతి ఒక్క విగ్రహాన్ని శుభ్రం చేసి అ ప్రాంతమంతా రంగులు అద్ది.. అందంగా తీర్చిదిద్దారు.రెండు దశల్లో నౌకా దళాల విన్యాసం జరుగుతుంది.బహుళ దేశాల నౌకాదళాల విన్యాసం మిలన్ 2022 రెండు దశలలో జరుగు తుంది. తొలిదశలో నౌకాదళ స్థావరం, ఆర్కే బీచ్లో నిర్వహించనున్నారు. ఈనెల 26న అంతర్జాతీయ నౌకా సదస్సుతో ఆరంభమయ్యే మిలన్కి.. 40కి పైగా దేశాల నుంచి నౌకాదళ ఉన్నతాధికారులు హాజరవుతున్నారు. 27న ఆర్కే బీచ్లో వివిధ నేవీలకు చెందిన బృందాలు పరేడ్ నిర్వహిస్తా యి. ఇందులో భాగంగానే సముద్రంపై నా, గగన తలంలోనూ యుద్ధ విమా నాలు, హెలికాప్టర్లు విన్యాసాలు చేయనున్నాయి.

# ఎమ్మెల్యేకు పబ్లిక్ వార్నింగ్

తిరుపతి, ఫిబ్రవరి 25, (న్యూస్ పల్స్)చ్చిన నేతకు నీరాజనం పలుకడమే కాదు.. తేడా వస్తే ఆ నేతను నిలదీయడం కూడా తెలుసునని నిరూపించారు ప్రజలు. తాజాగా ఓ ఎమ్మెల్యేను అడ్డగించిన ప్రజలు.. తమ ఊర్లోకి రావొద్దంటే రావొద్దంటూ అడ్డగించారు. ఇంకా ట్విస్ట్ ఏంటంటే.. సొంత మండలానికి చెందిన ప్రజలే ఇలా అడ్డుకోవడంతో సదరు ఎమ్మెల్యే షాక్ అయ్యారు. చివరకు చేసేది లేక.. ఆ ఎమ్మెల్యే వెనుదిరిగారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా వి.కోట మండలంలో పలమనేరు వైసీపీ ఎమ్మెల్యే వెంకటే గౌడకు చేదు అనుభవం ఎదురైంది. “రావద్దు.. రావద్దు మా గడపకు రావద్దు.. సమస్యలు పట్టని ఎమ్మెల్యే మాకొద్దు.” అంటూ కొంగాటం గ్రామ ప్రజలు వినూత్నరీతిలో నిరసన చేపట్టారు. గ్రామంలో ఎమ్మెల్యే పర్యటనను అడ్డుకున్నారు. “ఎమ్మెల్యే, సర్పంచ్ మా గడపకు రావొద్దు. మీకో దండం.” అంటూ బ్యానర్లతో నిరసన వ్యక్తం చేశారు కొంగాటం గ్రామస్తులు. అయితే, సొంత మండలంలోనే గడ్డు పరిస్థితి ఎదురవ్వడంతో ఎమ్మెల్యే షాక్ అయ్యారు. ఈ ఊహించని తిరుగుబాటుతో ఆయన కంగుతిన్నారు. ఇదిలాఉంటే.. పట్టం కట్టామని పట్టించుకోకుండా ఉంటే పరిస్థితి ఇలాగే ఉంటుందని పౌరులు వార్నింగ్ ఇస్తున్నారు.

# ఇద్దరి హత్యకు దారి తీసిన వివాహేతర సంబంధం

కర్నూలు వివాహేతర సంబంధం ఇద్దరి హత్యకు దారి తీసిన కర్నూలు జిల్లా హోలాగుంద మండలంలో చోటు చేసుకుంది.. తన భార్య వేరొకరితో ఉండడాన్ని గమనించిన ఓ వ్యక్తి ఇద్దరినీ పిడిబాకుతో హత్య చేశాడు. ఈ ఘటన హ్పళగుంద మండలం కోగిలతోట గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. హ్పళగుంద ఎస్ఐ విజయ్కుమార్ వివరాల మేరకు.. కోగిలతోట గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు బళ్లారి జిల్లా హలిపి గ్రామానికి చెందిన గాయత్రితో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి వీరి వైవాహిక జీవితం సాఫీగా సాగుతున్నా.. ఇటీవల గాయత్రిపై శ్రీనివాసులుకు అనుమానం మొదలైంది. శ్రీనివాసులు, హనుమంతప్ప స్నేహితులు. హనుమంతప్ప తరచూ శ్రీనివాసులు ఇంటికి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో హనుమంతప్ప, గాయత్రి మధ్య వివాహేతర సంబధం ఏర్పడింది. గురువారం రాత్రి హనుమంతప్పను తన ఇంటికి భోజనానికి రావాలని శ్రీనివాసులు ఆహ్వానించాడు. గ్రామ సమీపంలో ఇద్దరూ మద్యం తాగారు. అనంతరం శ్రీనివాసులు ఇంటికి వెళ్లి భోజనం చేశారు. ఇద్దరూ ఇంటి వరండాలోనే నిద్రించారు. శ్రీనివాసులు బాగా నిద్రించాడని భావించి హనుమంతప్ప ఇంట్లోకి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత లేచిన శ్రీనివాసులు.. ఇంట్లో తన భార్యతో హనుమంతప్ప ఉండడాన్ని చూశాడు. ఆగ్రహంతో గాయత్రి , హనుమంతప్పను పిడిబాకుతో హత్య చేసి పారిపోయాడు. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పిడిబాకును, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

# ఉక్రెయిన్ లో నలుగురు రాయదుర్గం విద్యార్ధులు

అనంతపురం ఉక్రెయిన్ లో వైద్య విద్యను అభ్యసించడం కోసం అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం నుండి వెళ్లిన నలుగురు విద్యార్థులు ఉక్రెయిన్ లో చిక్కుకున్నారు. ఈ విషయం తెలుసుకున్నప్పటి నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అక్కడ జరుగుతున్న యుద్ధ వాతావరణంలో చిక్కుకున్న తమ పిల్లలను ఇండియాకు రప్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. ఉక్రెయిన్ లో చిక్కుకున్న విద్యార్థుల్లో రాయదుర్గం పట్టణానికి చెందిన సాయి గణేష్, అజిత్ రెడ్డి, ఆముక్త ,కనేకల్ మండలం 43 ఉడేగోళం గ్రామానికి చెందిన తిప్పేస్వామి ఉన్నారు. యుద్ధవాతావరణం లో చిక్కుకున్న విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని వీడియో కాల్ ద్వారా విద్యార్థులు తెలియజేశారు. ఇప్పటివరకు వారు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు.

# ఉక్రేయిన్ లో నెమ్మికల్ విద్యార్థి

సూర్యాపేట ఆత్మకూర్ (ఎస్ ) మండలం నెమ్మికల్ గ్రామానికి చెందిన బీరవోలు వెంకట్ రెడ్డి , రేణుక దంపతుల కుమారుడు సంపత్ రెడ్డి ఉక్రెయిన్ దేశంలోని జఫ్రోసియా యూనివర్సిటీ లో ఎంబీబీఎస్ ఐదో సంవత్సరం చదువుతున్నాడు . కరోనా కారణంగా గ్రామంలో ఉన్న సంపత్ గత ఏడు నెలల క్రితం తీరిగి ఉక్రెయిన్ కి వెళ్ళాడు . రష్యా , ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో సంపత్ రెడ్డి అక్కడ చిక్కుకుపోవడంతో తల్లితండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు , ఇప్పటి వరకు ఇంటర్నెట్ పనిచేయడంతో ఫోన్లో వీడియో కాల్ మాట్లాడే అవకాశం దొరుకుతుందని తాజాగా పుతిన్ దాడులను దేశ వ్యాప్తంగా విస్తరించాలని ఆదేశించినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఇంటర్నెట్ కూడా బంద్ అయ్యేలా ఉందని అదే పరిస్థితి వస్తే అక్కడ పిల్లల పరిస్థితి తెలియకుండా పోయే ప్రమాదం ఉందని , దయచేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు త్వరగా చర్యలు తీసుకుని తమ కుమారుడు సహా అందరిని ఇండియాకు తీసుకురావాలని తల్లితండ్రుల వేడుకుంటున్నారు.

## తాహసిల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీ

శ్రీకాకుళంపలాస తాహసిల్దార్ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీ బైఠాయించారు. పలాస మండలం మోదుగులపుట్టి గ్రామానికి చెందిన ఆవుగాన షణ్ముఖరావు తన పొలాన్ని చదును చేసే క్రమంలో ఇంకో పొలానికి మట్టి తరలిస్తుండగా గమనించిన విఆర్వో అక్కడకు చేరుకుని మట్టి తరలించే ప్రయత్నం నిలుపుదల చేశారు. ఈ విషయంపై రైతు షణ్ముఖరావు ఈనెల 22వ తారీఖున పలాస తాసిల్దార్ ఫిర్యాదు చేయగా, నేటి వరకు సమస్యలను పరిష్కరించకపోవడంతో మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ తాసిల్దార్ ను కలిసి వివరణ అడిగారు. ఒకరైతు తన పొలంలో ఉన్న మట్టిని తాము తరలిస్తుంటే ఎటువంటి ఫిర్యాదు లేకుండా విఆర్ఓ పనులు ఆపే అధికారం ఉందా? అని నిలదీశారు. రెండు అడుగుల మేర వరకు తన పొలంలో తాను మట్టి తరలించే అధికారం రైతుకు ఉందని తాసిల్దార్ తెలిపారు. రైతు షణ్ముఖరావు సమస్య తక్షణమే పరిష్కరిం చాలని తాసిల్దార్ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి బైఠాయించారు.

# అయ్యన్నపాత్రుడు ఏమి సాధించాడని నారా లోకేష్ నర్సీపట్నం వచ్చాడు

**- ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్**

నర్సీపట్నం టీడీపీ జాతీయ ప్రదాన కార్యదర్శి నారా లోకేష్ గురువారం నర్సీపట్నం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు ఇంటికి రావడం పై ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ విలేకరులతో మాట్లాడుతూ మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు ఏమి సాధించారు అని నారా లోకేష్ అయ్యన్న ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను కలసి మాట్లాడారు అని అన్నారు. పోలీసులు కేసులు పెట్టి ఏమి పీకుతారు అనే అయ్యన్నపాత్రుడు మరి పోలీసులు 41(ఎ) నోటీసు ఇవ్వడానికి ఇంటికి వెళ్లితే అయ్యన్నపాత్రుడు ఇంట్లో పిల్లిలాగా దాక్కోవడం ఏంటి అని ప్రశ్నించారు. అయ్యన్నపాత్రుడు కోర్టు నుండి స్టే తెచ్చుకొని ఇంట్లో దాక్కుంటే నారా లోకేష్ వచ్చి పరామర్శించారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల లో టీడీపీ మీటింగ్ లో అయ్యన్నపాత్రుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, మంత్రుల పై అనేక అనీచిత వ్యాఖ్యలు చేస్తూ చెత్త నాయకులు రాజకీయనాయకులు అయ్యిపోతున్నారు అని అన్నారు. అది నిజమే 1983 లో కూడా ఆ చెత్త నాయకులే ఎమ్మెల్యే అయ్యారని ఎద్దేవాచేశారు. 24 గంటల పాటు పిల్లిలా బెడ్ రూమ్ లో దాక్కున్నా అయ్యన్నపాత్రుడు తన పార్టీ కార్యకర్తలను ఇంటి చుట్టు కాపలా పెట్టుకున్న అయ్యన్నపాత్రుడు ఎంత ధైర్యవంతుడో అందరికి తెలిసిందన్నారు. 41(ఎ) నోటీసు తీసుకోలేని ధైర్యం లేని అయ్యన్నపాత్రుడు ధీరుడు,సురుడు,వీరుడు అని చెప్పుకోవడం సిగ్గు చేటు అని అన్నారు.

# ఈనెల 27న సుస్థిర వ్యవసాయ రైతు చైతన్య సదస్సు

హైదరాబాద్ రసాయన క్రిమిసంహారకాలు వాడుతూ చేస్తున్న వ్యవసాయం వల్ల పుడమికి జరుగుతున్న నష్టం, సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం నిర్వహించడం ఎలా అనే అంశాలను రైతులకు వివరించేందుకు ఈనెల 27న వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి సుస్థిర వ్యవసాయ రైతు చైతన్య సదస్సు ను నిర్వహిస్తున్నట్లు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ రాజేందర్ రెడ్డి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సదస్సుకు సంబంధించిన బ్రోచర్ ను ఆయన ఆవిష్కరించారు. తెలంగాణ రైతులకు వ్యవసాయ రంగంపై సంపూర్ణ చైతన్యం తీసుకు రావడమే లక్ష్యంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ పద్మావతి శ్రీనివాస గార్డెన్స్ లో సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రకృతి సిద్ధంగా వ్యవసాయం నిర్వహించడం, ప్రత్యామ్నాయ పంటలు, వ్యవసాయ అనుబంధ రంగాల నిర్వహణ, నూతన వ్యవసాయ సాగు పద్ధతులు అనే అంశాలపై సదస్సులో చర్చిస్తామని తెలిపారు. సదస్సులో భాగంగా ప్రకృతి వ్యవసాయ దారుల పంటల ప్రదర్శన, ఉత్తమ రైతు దంపతులకు పుడమి పుత్ర పురస్కారాలు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి కిసాన్ సేవ రత్న అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు.

# మంత్రులకు పవన్ ఫ్యాన్స్ సెగ

గుడివాడ రాష్ట్ర మంత్రులు కొడాలి నాని ,పేర్ని నానిలకు కృష్ణాజిల్లా గుడివాడలో పవన్ కళ్యాణ్ అభిమానుల సెగ తగిలింది. పట్టణంలోని జి 3 భాస్కర్ థియేటర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పేర్ని నాని,కొడాలి నానిలను కు అడ్డుకునేందుకు పవన్ కళ్యాణ్ అభిమానులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.జై పవన్ కళ్యాణ్,ప్రభుత్వ మొండి వైఖరి నశించాలంటు అభిమానులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. థియేటర్లో భీమానాయక్ ప్రారంభ చిత్రం కావడంతో పెద్దసంఖ్యలో అభిమానులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు.జి 3 థియేటర్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్,తో పాటుగా పలువురు అభిమానులను పోలీసులు అరెస్ట్ చేశారు.దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పవన్ కళ్యాణ్ సినిమాలను కక్ష పూరితంగా అడ్డుకోవడం దారుణమని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు.సినీ ఫోటో గ్రాఫి శాఖ మంత్రికి వినతి పత్రాన్ని ఇచ్చేందుకు వచ్చిన తమను అరెస్ట్ చెయ్యడం ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని పవన్ కళ్యాణ్ అభిమానులు మండిపడ్డారు.

# శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవారికి విజయవాడ దుర్గమల్లేశ్వరస్వామి దేవస్థానం తరుపున పట్టువస్త్రాలు సమర్పణ



శ్రీశైలం శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నాలుగోవరోజు వైభవంగా కొనసాగుతున్నాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా విజయవాడ దుర్గమల్లేశ్వరస్వామి దేవస్థానం తరుపున దుర్గమ్మ ఆలయ ఈవో భ్రమరాంబ శ్రీశైలం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న విజయవాడ దుర్గమల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో భ్రమరాంబ,అర్చకులు,అధికారులకు శ్రీశైలం ఆలయ ఈవో ఎస్.లవన్న అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు అనంతరం స్వామి అమ్మవార్ల పట్టు వస్త్రాలకు శ్రీశైల దేవస్థానం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షణలు నిర్వహించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవారికి శాస్త్రోక్తంగా పట్టువస్త్రాలు సమర్పించారు అమ్మవారి ఆశీర్వచన మండపంలో శ్రీశైలం దేవస్థానం ఈవో లవన్న, విజయవాడ దుర్గమల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో భ్రమరాంబకు స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలతో సత్కరించి స్వామి అమ్మవార్ల లడ్డు ప్రసాదాలను అందించగా అర్చకులు వేదపండితులు శాస్త్రోక్తంగా వేద ఆశీర్వచనలిచ్చి దీవించారు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వారికి విజయవాడ దుర్గమల్లేశ్వరస్వామి దేవస్థానం తరుపున పట్టువస్త్రాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తుందని స్వామి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్రంలోని ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వారిని కోరుకున్నామని దుర్గమ్మ ఆలయ ఈవో భ్రమరాంబ తెలిపారు..

# వైసీపీ ప్రభుత్వం లో ప్రజలపైపన్నుల దాడి, ధరల తాకిడి

**పన్నుల భారాలు మోపడం దారుణం**

మచిలీపట్నం వైసీపీ పాలకులు అసమర్థత తో రాష్ట్రానికి ఆదాయ మార్గాలు అన్వేషించకుండా, ఆదాయం సృష్టించే మార్గాలు తెలియక ప్రజలపై పన్నుల భారాలు మోపడం దారుణమని, తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం నగరం అధ్యక్షుడు, ఎండి ఇలియాస్ పాష , టీడిపి మచిలీపట్నం పార్లమెంట్ ప్రచార కార్యదర్శి, పి.వి. ఫణి కుమార్, టీడిపి మచిలీపట్నం నగరం ప్రధాన కార్యదర్శి, పిప్పళ్ల వెంకట కాంతారావు లు పేర్కొన్నారు. శుక్రవారం మచిలీపట్నంలో నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నిత్యావసర సరుకుల ధరలు మన రాష్ట్రంలో మాత్రమే పెరిగాయి అన్నారు. దానికి కారణం వైసీపీ ప్రభుత్వం అసమర్థత, అక్రమ విధానాలే కారణమన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో ప్రతిపక్షాల వారందరూ కార్పొరేషన్లో వైసీపీ గెలిస్తే ఆస్తిపన్ను, చెత్త పన్నులతోపాటుగా పలురకాల పన్నులు వైసీపీ పాలకులు వేస్తారు అని చెప్పడం జరిగింది అన్నారు. దానిపై వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులు, ఆ పార్టీ నాయకులు ప్రతిపక్షాలు చెప్పేవన్నీ అసత్యాలని, పన్నులు పెంచమని, ఎటువంటి కొత్త పన్నులు వేయము అంటూ ప్రజలను నమ్మించి వైసీపీ పాలకులు కార్పొరేషన్ ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని గెలిచిన తర్వాత ప్రజలను మోసం చేయడం చూస్తున్నామన్నారు. వైసీపీ కార్పొరేషన్ లో అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు అడిగేవారే లేరు అన్న ధోరణితో పన్నులు విపరీతంగా పెంచుతున్నారు అన్నారు.

# తాండూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

**ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి**

తాండూరు తాండూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా బరిలో ఉంటానని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి ఢంకా బజాయించారు. అధిష్టానం తనకే టిక్కెట్టు ఇస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని తన నివాసంలో మీడియాతో సమావేశమైన ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి సంచలన వాఖ్యలు చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీచేయడం ఖాయమన్నారు. సిట్టింగులకు టిక్కెట్టు ఇచ్చే విషయంలో అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని, గతంలో వికారాబాద్, మేడ్చల్ నియోజకవర్గాల్లో సిట్టింగులకు టిక్కెట్టు ఇవ్వలేదని ఉదహరించారు. కొందరు స్వార్థపరులే ఎమ్మెల్యే వెంట వెళ్లారని, అయినా వాళ్లందరూ టచ్ లో ఉన్నారని తెలిపారు. వాళ్లను ఎప్పుడు పిలిచినా వస్తారన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నేతలే ఉన్నారని విమర్శించారు. మంత్రి పదవిపై అధిష్టానం చేతుల్లో ఉందని, సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు నడుచుకుంటామన్నారు. మరోవైపు మున్సిపల్ చైర్ పర్సన్ పదవిపై ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి స్పందించారు. వచ్చే ఐదేళ్ల వరకు ఆమె పదవికి డోకా ఉండదన్నారు. మెజార్టీ కౌన్సిలర్లు ఆమెకు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ఒకవేళ అవిశ్వాసం పెట్టాలనుకున్నా.. నాలుగేళ్ల వరకు వీల్లేదని అన్నారు. అప్పుడు పెట్టినా కూడా గెలుస్తామన్నారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కరణం పురుషోత్తంరావు, చైర్ పర్సన్ స్వప్న పరిమళ్, ఫ్లోర్ లీడర్ శోభారాణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మకాం మారుస్తున్న వ్యూహకర్తలు

హైదరాబాద్, ఫిబ్రవరి 25, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో ఎన్నికల వ్యూహకర్తలు మకాం వేస్తున్నారు. రాజకీయ పార్టీలు సర్వే సంస్థలను రంగంలోకి దింపుతున్నాయి. అయితే, గతంలో సొంత వ్యూహాలతో టీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన కేసీఆర్?.. ఈసారి వ్యూహకర్త ప్రశాంత్? కిషోర్?తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పార్టీ వర్గాలే ఒప్పుకుంటున్నాయి. ఇప్పటి వరకు తమకు పీకేలు అవసరం లేదని, కాంగ్రెస్ కార్యకర్త ఒక్కో పీకేతో సమానం అంటూ టీపీసీసీ చీఫ్? రేవంత్?రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ, రాజకీయ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో కాంగ్రెస్? అధిష్టానం రాష్ట్రంపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగానే మొన్నటి దాకా ప్రశాంత్? కిషోర్?తో కలిసి పని చేసిన సునీల్?కనుగోలు (ఎస్?కే)ను రంగంలోకి దింపుతోంది. ఈ మేరకు ఏఐసీసీ కీలక నేత సమక్షంలో ఒప్పందం కూడా జరిగినట్లు సమాచారం. రాష్ట్రంలో అతి త్వరలోనే కాంగ్రెస్? పక్షాన ఎస్కే టీం రంగంలోకి దిగుతోంది. కేవలం తెలంగాణ మాత్రమే కాకుండా కర్ణాటకకు కూడా సునీల్? కనుగోలు ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించనున్నారు.2014లో విదేశాల నుంచి దేశానికి వచ్చిన సునీల్? కనుగోలు ముందుగా ప్రశాంత్? కిషోర్?తో కలిసి ఐప్యాక్?లో పని చేశారు. వీరిద్దరి వ్యూహాలు బీజేపీకి 2019 పార్లమెంట్? ఎన్నికల్లో చాలా మేరకు కలిసి వచ్చాయి. అంతేకాకుండా అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్ (ఏబీఎం) ఆధ్వర్యంలో బీజేపీకి సునీల్? కనుగోలు వార్ రూంను నడిపించారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ మరియు కర్నాటక ఎన్నికల ప్రచారంలో బీజేపీకి ఎన్నికల వ్యూహాల్లో సునీల్? కీలకంగా పని చేశారు. అంతకు ముందు తమిళనాడులో 2016లో డీఎంకేకు పని చేశారు. పీకే ఆధ్వర్యంలోనే సునీల్? తమిళనాడులో వ్యూహాలు అమలు చేశారు. డీఎంకే అధినేత స్టాలిన్ కోసం 'నమక్కు నామే' (మనకోసం మనం) అంటూ ఒక ప్రత్యేక ప్రచారాన్ని రూపొందించిన ఘనత సునీల్?దే.ఏపీకి చెందిన సునీల్? కనుగోలు కుటుంబం చాల ఏండ్ల కిందటే చెన్నైలో స్థిరపడింది. అక్కడ పలు వ్యాపారాలు కూడా నిర్వహిస్తున్నారు. 2018లో పీకేతో కలిసి ఉన్న ఎస్?కే.. టీఆర్ఎస్‌కు పని చేశారు. ప్రశాంత్ కిశోర్ ప్రధాన శిష్యుడని, ఐప్యాక్ టీమ్‌లో కీలక సభ్యుడని తేలింది. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీఆర్ఎస్‌కు సునీల్? రాజకీయ వ్యూహకర్తగా పని చేశారు. ఆ సమయంలో టీఆర్ఎస్ సోషల్? మీడియాను పూర్తిగా నడిపించారు.రెండు పర్యాయాలు సొంత వ్యూహాలతోనే టీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకొచ్చిన కేసీఆర్ ఈసారి పీకే సాయం తీసుకోవడంతో రాష్ట్రంలో ప్రతిపక్షాలు బలమైనట్లుగా భావిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు భిన్నంగా మారుతున్నాయి. గతంలో లేని విధంగా అధికార టీఆర్ఎస్ విపక్షాల నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. అటు కొంతకాలంగా బీజేపీ పుంజుకుంటున్నట్లుగా ఉండగా, టీపీసీసీ చీఫ్?రేవంత్?రెడ్డి నియామకం తర్వాత కాంగ్రెస్? కూడా దూకుడు పెంచింది. అయితే, హుజూరాబాద్ ఉపఎన్నికల్లో గెలుపు తరువాత బీజేపీ మరింత స్పీడ్? పెంచింది. టీఆర్ఎస్‌ను టార్గెట్‌గా పెట్టుకుంటూనే కాంగ్రెస్?పైనా ఫోకస్? చేస్తోంది. ఇక తాజా పరిణామాల్లో బీజేపీ అటు టీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్? కీలకంగా తీసుకోగా.. రాష్ట్రంలో మాత్రం టీఆర్ఎస్?పై రేవంత్? వర్గం దూకుడు పెంచింది. ఎన్నికల సమయానికి బీజేపీని పాత స్థానానికి పరిమితం చేసి, టీఆర్ఎస్‌కు బలమైన ప్రత్యర్థిగా ఎదగాలని ప్లాన్? చేస్తోంది. వచ్చే ఎన్నికల్లో విజయం కోసం ఏ విధంగా ముందుకు సాగాలనే దానిపై టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పీకే టీంతో కసరత్తు చేస్తుంటే.. తాజాగా కాంగ్రెస్? కూడా అదే దారిని ఎంచుకుంది.ముందు నుంచీ ప్రశాంత్? కిషోర్? ఐప్యాక్? బృందంలో కీలకంగా ఉన్న వారితోనే పార్టీలు అగ్రిమెంట్?చేసుకుంటున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు అదే ఎజెండాతో సాగుతున్నాయి. పీకేను టీఆర్ఎస్?పార్టీకి వ్యూహకర్తగా తీసుకుంటే.. ఐప్యాక్?లో రెండో మెంబర్?గా ఉన్న సునీల్? కనుగోలుతో కాంగ్రెస్?ఒప్పందం చేసుకుంటోంది. పీకే శిష్యుడిగా ఉంటూ, 2020 నుంచి వేరుగా వ్యవహరిస్తున్న ఎస్కేతో ముందుకు సాగాలని ఏఐసీసీ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. అంతకు ముందు వైఎస్సార్?టీపీ కూడా ఐప్యాక్? సభ్యురాలు ప్రియాతో చర్చలు జరిపిన విషయం తెలిసిందే.రాష్ట్ర రాజకీయాలు ఇద్దరు వ్యూహకర్తల మధ్యకు చేరాయి. గతంలో ఒకే దగ్గర పని చేసిన పీకే, ఎస్?కే ఇప్పుడు వేర్వేరు పార్టీలకు వ్యూహకర్తలుగా వ్యవహరించనున్నారు. ఇప్పటి దాకా అధికారంలో ఉన్న పార్టీకి పీకే సాయంగా ఉండగా, ఏడేండ్ల నుంచి అచేతన స్థితిలో ఉన్న కాంగ్రెస్?కు సునీల్? వ్యూహాలు అందించనున్నారు. ఇప్పుడిప్పుడో జోష్? వస్తున్నా సొంత పార్టీ నేతల తిరుగుబాట్లతో కాంగ్రెస్? కలహాల్లోనే కాలం వెళ్లదీస్తోంది. రాష్ట్రంలో టీఆర్ఎస్?పై వ్యతిరేకత పెరుగుతుందని పలు సర్వే సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే అధికార టీఆర్ఎస్?తో పాటు కాంగ్రెస్, బీజేపీలు సొంతంగా సర్వేలు చేయించుకున్నాయి. దీంతో టీఆర్ఎస్?పై వ్యతిరేకతతో పాటుగా ఇరు పార్టీలకు అనుకూలంగా ఉందనే విషయాలు వెల్లడయ్యాయి. ఈ నేపథ్యంలోనే సర్వే వివరాలన్నీ పరిశీలించిన తర్వాత ఏఐసీసీ ఆధ్వర్యంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణతో పాటుగా కర్ణాటక రాష్ట్రాల ఎన్నికల వ్యూహకర్తగా సునీల్? కనుగోలును నియమించుకున్నట్లు పార్టీ వర్గాలు చెప్పుతున్నాయి. త్వరలోనే ఆయన బృందం రాష్ట్రంలో పరిస్థితులను అంచనా వేయనున్నట్లు సమాచారం.ఈ నేపథ్యంలో నేతల మధ్య సయోధ్యతో పాటు పార్టీ ఎలా వ్యవహరించాలనే అంశంపై సునీల్? సూచనలు కీలకమయ్యే అవకాశాలున్నాయి. అంతేకాకుండా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సునీల్?.. టీఆర్ఎస్‌కు పనిచేయడం కూడా కాంగ్రెస్?కు కొంత కలిసి వచ్చే అంశమే. రాష్ట్రంలో ఒక విధమైన రాజకీయ వాతావరణం హీటెక్కుతున్న నేపథ్యంలో పీకే, ఎస్కే వ్యూహాలతో రాజకీయాలు ఎలా మారుతాయో చూడాల్సిందే

# మకర వాహనంపై కపిలతీర్థ విభుడు

తిరుపతి, ఫిబ్రవరి 25 తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన శుక్రవారం ఉదయం శ్రీ కపిలేశ్వరస్వామి వారు సోమస్కందమూర్తిగా కామాక్షి అమ్మవారి సమేతంగా మకర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కోవిడ్ -19 నిబంధనల మేరకు వాహన సేవలు ఆలయంలో ఏకాంతంగా నిర్వహించారు.మకరం గంగాదేవికి నిత్యవాహనం. గంగ పరమశివుని శిరస్సుపై నివసిస్తోంది. గంగాదేవి వాహనమైన మకరం తపమాచరించి శివానుగ్రహాన్ని పొంది ఆ పరమశివునికి వాహనమైందని శైవాగమాలు తెలియజేస్తున్నాయి. మకరం జీవప్రకృతికి ఉదాహరణ. భగవంతుని ఆశ్రయించినంత వరకు జీవుడు నీటిలో మొసలిలా బలపరాక్రమంతో జీవించవచ్చు. అనంతరం ఉదయం 9 నుండి 10 గంటల వరకు అర్చకులు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. శ్రీ సోమస్కందమూర్తి, శ్రీ కామాక్షిదేవి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు.

# సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనంలో ప్రాధాన్యత

**శని,అది వారాల్లో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన టిటిడి**

తిరుమల,ఫిబ్రవరి 25 సర్వదర్శనం భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు శుక్ర,శని,ఆదివారాలలో సిఫార్సు లేఖల పై కేటాయించే విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేయడమైనది. విఐపిల కోసం కేటాయించిన సమయాన్నీ కూడా సామాన్య భక్తులకు కేటాయించేలా నిర్ణయం తీసుకోవడం జరిగింది. శుక్ర,శని,ఆదివారాలలో సర్వదర్శనం భక్తుల సౌకర్యార్థం అదనంగా దర్శన టోకన్లు జారి చేసేందుకు నిర్ణయించడమైనది. ఇప్పటికే రోజుకు సర్వదర్శనం భక్తులకు 30 వేల టోకన్లు జారి చేస్తున్న టిటిడి, తాజా నిర్ణయంతో సర్వదర్శన భక్తులకు రోజుకు అదనంగా మరో రెండు గంటల దర్శన సమయం పెరుగుతుంది.

# మార్చి 1 నుండి 9వ తేదీ వరకు

**జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు**

తిరుపతి, ఫిబ్రవరి 25 హైదరాబాద్ జూబ్లీహిల్స్లోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మార్చి 1 నుండి 9వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఫిబ్రవరి 28వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు

| తేదీ | ఉదయం | సాయంత్రం |
|---|---|---|
| 01-03-2022 | ధ్వజారోహణం(మేష లగ్నం) | పెద్దశేష వాహనం |
| 02-03-2022 | చిన్నశేష వాహనం | హంస వాహనం |
| 03-03-2022 | సింహ వాహనం | ముత్యపుపందిరి వాహనం |
| 04-03-2022 | కల్పవృక్ష వాహనం | సర్వభూపాల వాహనం |
| 05-03-2022 | పల్లకీ ఉత్సవం(మోహినీ అవతారం) | గరుడ వాహనం |
| 06-03-2022 | హనుమంత వాహనం | గజ వాహనం |
| 07-03-2022 | సూర్యప్రభ వాహనం | చంద్రప్రభ వాహనం |
| 08-03-2022 | రథోత్సవం | అశ్వవాహనం |
| 09-03-2022 | చక్రస్నానం | ధ్వజావరోహణం |

ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 8 నుండి 9 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. మార్చి 10న సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు పుష్పయాగం జరుగనుంది.

# బీమ్లా నాయక్ సినిమా టికెట్ ధర 5రూపాయలు

అనంతపురం అనంతపురం జిల్లా గోరంట్లలో భీమ్లా నాయక్ సినిమా టికెట్ వెల 5 రూపాయలు ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనగా పవన్ కళ్యాణ్ అభిమానులు జనసేన కార్యకర్తలు థియేటర్ యాజమాన్యాలు నష్టపోకుండా మా వంతుగా 500 రూపాయలు ఇస్తాం థియేటర్లను కాపాడుకుంటాం అంటూ గోరంట్ల చంద్రశేఖర్ థియేటర్ వద్ద జనసేన ఆధ్వర్యంలో విరాళాల సేకరణ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేసిన అభిమానులు. ఈ సందర్భంగా గా జనసేన జిల్లా కార్యదర్శి సురేష్ జనసేన నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ అయ్యా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మీరు ప్రజల కోసమే పని చేస్తామని ప్రజల సంక్షేమమే మా లక్ష్యం అని మాది ప్రజా ప్రభుత్వమని అనేకసార్లు చెబుతున్నారు కానీ నిరుపేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి సిమెంటు ధర 500 కు చేరింది. సిమెంట్ కొనలేక నిరుపేద కుటుంబాల వాళ్ళు ఇల్లు నిర్మించుకో లేక ఆపేశారని దానిపై దయలేని మీరు ఇలా ఎందుకు చేస్తున్నారో ఆలోచించుకోవాలని. అందులోనూ మీ భారతి సిమెంట్ రేటు కూడా పెంచారు. అందువలన మీరు ప్రజల కోసం ఆలోచించే ముఖ్యమంత్రి అయితే సినిమా టికెట్ల ధర తగ్గించిన విధంగా భారతి సిమెంట్ ధరలు తగ్గించి ప్రజలు సులభంగా ఇల్లు నిర్మించుకునేందుకు తక్కువ రేటుకే భారతి సిమెంట్ అందించి ఆదుకోవాలని కోరారు.

# మదనపల్లిలో పవన్ అభిమానుల సందడి

మదనపల్లి చిత్తూరు జిల్లా మదనపల్లిలో బీమ్లా నాయక్ సినిమా విడుదల సందర్భంగా పెద్ద సంఖ్యలో అభిమానులు ఉదయం ఆరు గంటలకే థియేటర్ల వద్ద చేరుకున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు సినిమా పదిన్నరకు ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలియజేశారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో పెద్ద సంఖ్యలో కర్ణాటక నుంచి కూడా అభిమానులు మదనపల్లి చేరుకున్నారు. రాత్రి నుంచి థియేటర్ల వద్ద టికెట్ల కోసం అభిమానుల తిరుగుతున్నారయ. మరోవైపు జనసేన నాయకులు థియేటర్ల వద్దకు చేరుకొని హడావిడి చేస్తున్న పరిస్థితి కనిపించింది

# రాష్ట్రంలో ఏ వ్యవస్థనూ సిఎం వదలడం లేదు...

## మాజీ జిల్లాపరిషత్ చైర్మన్ బత్తిని వెంకట రాముడు



తుగ్గలిఫిబ్రవరి 25 ( విభారె) : రాష్ట్రంలో ఏ వ్యవస్థనూ సిఎం జగన్ మోహన్ రెడ్డి వదలడం లేదని మాజీ జిల్లాపరిషత్ చైర్మన్ బత్తిని వెంకట రాముడు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రోజున ఆయన మాట్లాడుతూ వినోదం పంచే సినిమా రంగాన్ని కూడా తీవ్రంగా వేధిస్తున్నాడని, భీమ్లా నాయక్ సినిమా విషయంలో జగన్ వ్యవహరిస్తున్న తీరు ప్రభుత్వ ఉగ్రవాదాన్ని తలపిస్తుందని అన్నారు. వ్యక్తులను టార్గెట్ గా పెట్టుకుని వ్యవస్థలను నాశనం చేస్తున్న ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన తెలియజేసారు. భారతీ సిమెంట్ రేటు పై లేని నియంత్రణ భీమ్లా నాయక్ సినిమా టిక్కెట్ల పై ఎందుకని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రపంచ స్థాయికి వెళ్లిన తెలుగు సినిమాను తెలుగు రాష్ట్రంలో వేధిస్తున్న జగన్ తన మూర్ఖపు వైఖరి వీడాలని, రాష్ట్రంలో ఉన్న ప్రజా సమస్యలు అన్నీ పక్కన పెట్టి థియేటర్ల దగ్గర రెవెన్యూ ఉద్యోగులను కాపలా పెట్టిన ప్రభుత్వ తీరు తీవ్ర అభ్యంతరకరమని ఆయన అన్నారు. ఉక్రెయిన్ లో చిక్కుకున్న తమ వారిని రక్షించేందుకు దేశంలో అన్ని రాష్ట్రాలు ప్రయత్నం చేస్తుంటే ఆంధ్ర ప్రదేశ్ సిఎం మాత్రం భీమ్లా నాయక్ పై కక్ష సాధింపు చర్యల్లో బిజీగా ఉన్నారని, తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు తప్పును పసిగట్టి నిలదీస్తుందని ఆయన తెలియజేసారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకుని భీమ్లా నాయక్ సినిమా విషయంలో వేధింపులు వెంటనే విరమించుకోవాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిని వెంకట రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి

బుచ్చిరెడ్డి పాళెంఫిబ్రవరి 25 ( విభారె) : బుచ్చి మండలం జొన్నవాడ దేవస్థానంలో వాటర్ ప్లాంట్,కళ్యాణ మండపం, మంచినీటి కుళాయిలు, లాకర్స్ ప్రారంభించిన కోవూరు శ్యాసన సభ్యులు ప్రసన్న కుమార్ రెడ్డి, తరవాతగా దేవస్థానం పాలకమండలితో బోర్డు మీటింగ్ లో పాల్గొని పలు కీలక నిర్ణయాలు తీసుకుని జొన్నవాడ దేవస్థానంలో నిత్య అన్నదానం కార్యక్రమం ప్రారంభించి భక్తులకు అన్నదానం చేసిన ప్రసన్న కుమార్ రెడ్డి,తరవాతగా యం ఎల్ ఎ మాట్లాడుతూ ఇంకనూ రాబోవు రోజులో జొన్నవాడను గొప్పగా అభివృద్ధి చేసామని తెలియజేసారు ఎవరైన దాతలు ఉంటే దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని తెలియజేసారు, ఈ కార్యక్రమములోవవ్వేరు బ్యాంక్ చైర్మెన్ సూరాశ్రీనివాసులురెడ్డి,జొన్నవాడ దేవస్థానం చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు , ఎంపీటీసీ బాలక్రిష్ణ మరియు దేవస్థానం పాలకమండలి సభ్యులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు

# గిరిజన యానాదులను ప్రభుత్వం ఆదుకోవాలి



నంద్యాల ఫిబ్రవరి 25 ( విభారె) :- దశాబ్దాల తరబడి సంచారజాతి యానాదులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందివ్వడంలో అన్యాయం జరుగుతూనే ఉందని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయడానికి అత్యంత కీలకమైన యానాదుల (ఎస్టి) కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తుండడంతోనే ఈ పరిస్థితి నెలకొందని ధ్వజమెత్తారు. శుక్రవారం నంద్యాల సమీపంలోని యానాదులు నివాసం ఉంటున్న స్థలం వద్దకు వెళ్లి రాజు నాయక్, రవి నాయక్ జిల్లా అధ్యక్షుడు బాలు నాయక్, మల్లేష్ నాయక్ వారి బృందం ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు గత కొంతకాలంగా 40 కుటుంబాలు ఇక్కడే తాత్కాలికంగా

### ఆంధ్ర ప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ డిమాండ్

గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నామని అయితే కొందరు తమ వద్దకు వచ్చి గుడిసెలను ఖాళీ చేయాలని బెదిరిస్తున్నట్లు సంచార కుటుంబాలు గిరిజన ప్రజా సమాఖ్య నేతలతో వాపోయారు. ఈ విషయంపై రాజు నాయక్ స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు వారు వెంటనే స్పందించి ప్రతి కుటుంబానికి కుల ధ్రువీకరణ పత్రాలు అందేటట్లు రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఇప్పించి న్యాయం చేస్తానని ఫోన్ లో హామీ ఇచ్చారని తెలిపారు. రాజు నాయక్ మాట్లాడుతూ యానాదులు పడుతున్న కష్టాలను భరించలేక జిపిఎస్ నేతలను ఆశ్రయించారని, విషయం తెలుసుకుని అక్కడ సమస్యలపై ఆరా తీయడం జరిగిందన్నారు. గిరిజనులకు అత్యంత కీలకమైన కుల ధ్రువీకరణ పత్రాలు ప్రతి ఒక్క కుటుంబానికి అందజేయాలని, సంక్షేమ పథకాలను వారికి అందేటట్లు అధికార యంత్రాంగం కృషి చేయాలని కోరారు. 40 ఏళ్లుగా గుడిసె లో ఉంటూ దుర్భర జీవితం గడుపుతున్న సంచార జాతులను ప్రభుత్వం ఆదుకుని వారికి పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వాలని వారు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గారికి విన్నవించారు. అధికారులు దృష్టి పెట్టి ప్రతి ఒక్కరికి కుల ధ్రువీకరణ (ఎస్టి) పత్రాలు ఇవ్వాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో జి పి ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్, జిల్లా అధ్యక్షుడు బాలు నాయక్, ఉపాధ్యక్షుడు మల్లేష్ నాయక్ కాలనీలో మరియు జిపిఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఏ ఐ వై ఎఫ్ ఆధ్వర్యంలో డాక్టర్ సుంకన్న బదిలీని రద్దు అపాండి అని ఆర్థిక మంత్రి కి వినతిపత్రం

డోన్ ఫిబ్రవరి 25 ( విభారె) డోన్ ప్రభుత్వ హాస్పిటల్లో గైనకాలజిస్ట్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుంకన్న బదిలీని ఆపాలని అఖిలభారత యువజన సమైక్య ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సొంటి పులి శేఖర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రతి నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేస్తున్నటువంటి సుంకన్న బదిలీని ఆపాలని మంత్రి కి విన్నవించారు, జిల్లాలోనే ప్రభుత్వ హాస్పిటల్ లో నెలకు కు 100 సిజేరియన్, 200 పైగా సాధారణ ప్రసవాలు అదేవిధంగా 300కు పైగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తూ జిల్లాలోనే అగ్రగామిగా డోన్ ప్రభుత్వ హాస్పిటల్ కు పేరు తెచ్చిన ఘనత డాక్టర్ సుంకన్న దక్కిందన్నారు, ఇటువంటి మనసున్న మంచి డాక్టర్ బదిలీని ఆపాలని డోన్ నియోజకవర్గ ప్రాంత ప్రజలు లు వారికి ఆయన విజ్ఞప్తి



చేశారు, అదేవిధంగా ప్రభుత్వ హాస్పిటల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను మరియు నర్సింగ్ పోస్టులు భర్తీ చేసి డోన్ మరియు పరిసరాల ప్రాంత ప్రజలకు మరింత నాణ్యమైన వైద్యం అందించే దిశగా వారు చేపట్టాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ మండల అధ్యక్షులు కొచ్చేరువు సుధాకర్. ఆర్గనైజింగ్ కార్యదర్శి విజయ్. సహాయ కార్యదర్శులు రంగస్వామి, యాపదిన్నె మధు శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# హమాలీలకు అన్యాయం చేయకండి

### మార్కెట్ యార్డు అమాలీల అధ్యక్షుడు గోపాల్

నంద్యాల ఫిబ్రవరి 25 ( విభారె) :- నంద్యాల పట్టణంలో మార్కెట్ యార్డు యందు నాలుగు రోజులుగా ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సివిల్ సప్లై హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని,కరోనా భీమా సౌకర్యం 50లక్షలు కల్పించాలని కోరుతూ సిఐటియు ఆద్వర్యంలో సివిల్ సప్లై హమాలీ కార్మికులు టెక్కె మార్కెట్ యార్డు ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు లక్ష్మణ్,సివిల్ సప్లై హమాలీ యూనియన్ కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ సివిల్ సప్లై హమాలీ



కార్మికులకు కూలి రేట్లు పెంచాలని,కరోనా భీమా సౌకర్యం 50లక్షలు కల్పించాలని, కరోనా కాలంలో కూడా ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ప్రభుత్వం చేస్తున్నటువంటి కృషికి తోడుగా కరోనాతో చనిపోతున్నా లెక్కచేయకుండా సివిల్ సప్లై హవాలి కార్మికులు ఎగుమతి, దిగుమతులు చేయడం జరిగిందని, ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని లేకుంటే నిరవధిక సమ్మె కైనా చలో విజయవాడ కైనా సిద్ధమని, రాబోయే కాలంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 40 మంది హమాలీ కార్మికులు పాల్గొనడం జరిగింది.

# చిరు వ్యాపారస్తులకు న్యాయం చేయండి : సీపీఎం డిమాండ్



నంద్యాల ఫిబ్రవరి 25 ( విభారె) :- నంద్యాల పట్టణంలో శుక్రవారం నాడు స్థానిక ఎన్జీవోస్ కాలనీ రామాలయం దగ్గర ఉన్న చిరు వ్యాపారస్తుల ను 30 రోజుల నుంచి అక్కడి నుంచి వెళ్లిపోవాలని మున్సిపల్ అధికారులు ఒత్తిడి చేయడం వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి నరసింహ అన్నారు. ఎన్నో ఏళ్లుగా చిన్న బండ్లపైన వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్న వారిని ఎప్పటికప్పుడు వచ్చి ఇక్కడి నుంచి వెళ్లి పోవాలి ప్రజలకు ఇబ్బంది అయింది అని చెప్పి వ్యాపారస్తుల కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయడం ఇదెక్కడి న్యాయమని 40 ఏళ్లు వ్యాపారాలు చేసుకుంటున్న వారిని పక్కన స్థలం ఇస్తామని చెప్పి 10 వందలు పెట్టి చోట 30 బండలో పెట్టుకుని చెప్పడం ఏ విధంగా సాధ్యపడుతుందని వారు అన్నారు. ఎన్జీవోస్ కాలనీ చిరు వ్యాపారస్తులు చేస్తున్న రెండో రోజు దీక్ష సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాదు నాయకులు షరీఫ్ సోమన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతయ్య చిరు వ్యాపారస్తులకు సంఘం నాయకులు ఆకుల రహీమ్ సత్యనారాయణ సిపిఐ ఎంఎల్ రఫీ భాష తదితర నాయకులు చిరు వ్యాపారస్తులకు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అని సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్ల నరసింహ తెలిపారు. చిరు వ్యాపారస్తుల సమస్య పరిష్కరించకుంటే మున్సిపల్ ఆఫీస్ ప్రజాప్రతినిధుల ఆఫీసు ముట్టడి చేస్తామని ఆయన తెలిపారు.

## సెల్ టవర్ నిర్మాణం పనులు అపాలి

### లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తాము సీపీఐ డిమాండ్

నంద్యాల ఫిబ్రవరి 25 ( విభారె) :- అబ్బిపురం గ్రామంలో నిర్మాణం లో నున్న ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణపనులను ఆపాలని ప్రభుత్వ అధికారులులకు విన్నవించిన పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే జిల్లా ప్రభుత్వ అధికారులు సెల్ టవర్ నిర్మాణాపనులను నిలిపివేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం నాడు విలేకరుల తో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కాపాడాలని. అలాగే కస్తూరి బా పాఠశాల విద్యార్థులకు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఈ సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుంది అని అన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో . సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యస్. బాబా ఫక్రుద్దీన్. సిపిఐ మహానంది మండల కార్యదర్శి ఆర్. సామేలు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు గురుమూర్తి. ఏఐటీయూసీ నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హీరో.. హీరోయిన్లు.. ఓ 'చుట్ట' కథ..!

'పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం.. క్యాన్సర్ కి కారకం' అని ఎన్ని బోర్డులు పెట్టినా.. పొగతాగడం వల్ల ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో సినిమా టైటిల్స్ కు ముందు కళ్ళకు కట్టినట్లుగా చూపించినా జనాలలో మాత్రం పెద్దగా మార్పు కనిపించడం లేదనే చెప్పాలి. పొగ పీల్చేవారి కంటే.. పక్కనుండే వారికి ఎక్కువ చేటు చేస్తుంది.. ఇబ్బంది పెడుతుంది. ఇక సినిమా వాళ్లలో కూడా ఎక్కువ శాతం మంది స్మోకింగ్ చేసే అలవాటు ఉన్నవారున్నారు. షూటింగ్ సమయంలో కాస్త విరామం దొరికితే చాలు.. సెట్ లోనో లేదా కార్వాన్ లోకో వెళ్లి దమ్ము కొట్టే నటీనటులు ఉన్నారు. ఇది వాళ్ళకి బాగానే ఉంటుంది కానీ.. పొగ అంటే పడని ఇతర ఆర్టిస్ట్ కు సమస్యగా మారుతుంది. ఇప్పుడు ఇదంతా చెప్పుకోవాల్సి వచ్చిందంటే.. టాలీవుడ్ లో ఓ హీరోకి ఉన్న ధూమపానం అలవాటు హీరోయిన్లకు తిప్పలు తెచ్చిపెడుతోందట. అనర్గళంగా డైలాగులు చెప్పడంలో తనకు తానే అనిపించుకున్న ఆ హీరోకి.. పొగాకుతో చేయబడిన 'చుట్ట' తాగే హ్యాబిట్ ఉంది. లొకేషన్స్ లో గ్యాప్ దొరికినప్పుడల్లా ఒకటి పీలుస్తుంటారు. చుట్ట తాగితే గొంతు బాగా వస్తుందని.. అప్పుడు ఎలాంటి కఠినతరమైన డైలాగ్ అయినా చెప్పడగలమని ఆ హీరో నమ్ముతాడు. అయితే హీరోకి ఉన్న ధూమపానం అలవాటు ఆయనతో పనిచేసే హీరోయిన్లకు చికాకు కలిగిస్తోందట. అతనికి దగ్గరగా ఉండి యాక్ట్ చేయాల్సిన సన్నివేశాలప్పుడు అసౌకర్యంగా ఉంటున్నారట. చుట్ట వాసన భరించలేక అనేక సార్లు దర్శక నిర్మాతలకు కూడా ఫిర్యాదు చేశారట. పొగాకు వాసన వల్ల వాంతులు అవుతున్నాయని కూడా చెబుతున్నారు. అయితే కోపస్తుడికి ముద్రపడిపోయిన హీరోకి ఈ విషయం గురించి చెప్పడానికి సెట్ లో ఎవరూ సాహసించడం లేదు. దీంతో దర్శక నిర్మాతలతో హీరోయిన్లు గొడవ పడే పరిస్థితి వస్తోందట. ఇలాంటివి సహజమని.. వారితో కలిసి పని చేయాల్సి వస్తే అలాంటి వాటిని తట్టుకోవాల్సి ఉంటుందని వారికి నచ్చజెప్తున్నారట. ఏదేమైనా సదరు హీరోకి ఉన్న చుట్ట తాగే అలవాటు హీరోయిన్లకు తంటాలు తెచ్చి పెడుతోందని తెలుస్తోంది. స్మోకింగ్ వదలలేక పోతే.. చుట్ట మానేసి కనీసం సిగరెట్ కి అయినా షిఫ్ట్ అయిపోమని ఎవరైనా ఆయనకు సలహా ఇస్తే బాగుండు అని హీరోయిన్లు అనుకుంటున్నారట.



# డార్లింగ్ ఫ్యాన్స్ కోసం 'రాధేశ్యామ్' కొత్త కంటెంట్ రెడీ..!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన లేటెస్ట్ మూవీ 'రాధే శ్యామ్'. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా 2022 మార్చి 11న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. అయితే విడుదల తేదీకి రెండు వారాలే సమయం ఉన్నా ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేయడం లేదని.. ప్రమోషనల్ కంటెంట్ వదలడం లేదని డార్లింగ్ ఫ్యాన్స్ నిర్మాతలను ట్రోల్ చేస్తున్నారు.'రాధేశ్యామ్' సినిమాకు సంబంధించి ఇప్పటికే టీజర్ - ట్రైలర్ - నాలుగు పాటలు విడుదలయ్యాయి. సందర్భం వచ్చినప్పుడల్లా స్పెషల్ పోస్టర్స్ వదులుతూ ఉన్నారు. ముందుగా సంక్రాంత్రికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేయడంతో.. దానికి తగ్గట్టే భారీ ఎత్తున ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఇటీవల వాలెంటైన్స్ డే స్పెషల్ గా ఓ గ్లిమ్స్ కూడా రిలీజ్ చేసారు. అయినప్పటికీ ప్రభాస్ అభిమానులు మాత్రం 'రాధే శ్యామ్' నుంచి అంతకుమించి ఏదైనా కంటెంట్ వదిలేలా ప్లాన్ చేసుకోమని మేకర్స్ ను రిక్వెస్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇది సోషల్ మీడియాలో నెగెటివ్ ట్రెండ్ చేసే వరకు వెళ్ళింది. అయితే ఇప్పటికే అవసరమైన కంటెంట్ వదిలిన మేకర్స్.. ఇకపై ఏమి వదిలినా స్టోరీలో ఆసక్తికరమైన పాయింట్స్ రివీల్ అయ్యే ప్రమాదం ఉంది. ఇవేమీ ఆలోచించని అప్డేట్స్ ఇవ్వడం లేదంటూ ఫ్యాన్స్ మాత్రం నిర్మాతలను ట్రోలింగ్ చేస్తున్నారు. మిగతా హీరోల సినిమాల కంటెంట్ బయటకు వచ్చిన ప్రతీసారి ఫైర్ అవుతుంటారు. ఏదైతేనేం ఇప్పుడు వాళ్ళని శాంతింపజేయడానికి 'రాధే శ్యామ్' మేకర్స్ కొత్త ప్రమోషనల్ కంటెంట్ రెడీ చేస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఓ ట్రైలర్ ను కూడా కట్ చేయడంతో పాటుగా.. మేకింగ్ వీడియోను సిద్ధం చేస్తున్నారట. అలానే ఐదో పాటను కూడా రిలీజ్ చేయాలని చూస్తున్నారట. మార్చి మొదటి వారం మొదలుకొని సినిమా రిలీజ్ అయ్యే లోపు ఈ కంటెంట్ అంతా బయటకు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో స్పెషల్ ఇంటర్వ్యూలు - ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేయనున్నారు. 'రాధే శ్యామ్' ప్రమోషన్స్ కు సంబంధించిన వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి. కాగా రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'రాధేశ్యామ్' సినిమాలో ప్రభాస్ సరసన పూజాహెగ్డే హీరోయిన్ గా నటించింది. 1970స్ యూరప్ బ్యాక్ డ్రాప్ లో వింటేజ్ ప్రేమకథా ఈ చిత్రం రూపొందింది. హస్తసాముద్రిక నిపుణుడు విక్రమాదిత్య గా ప్రభాస్ నటించగా.. ప్రేరణగా పూజా హెగ్డే కనిపించనుంది. కృష్ణంరాజు సమర్పణలో యూవీ క్రియేషన్స్ మరియు గోపీకృష్ణ మూవీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. వంశీ - ప్రమోద్ - ప్రసీద నిర్మాతలుగా వ్యవహరించారు.

# విజయశాంతి తర్వాత లేడీ అమితాబ్ ఎవరు?



స్వయంగా వెల్లడించింది. బాలీవుడ్ లెజెండరీ యాక్టర్ అమితాబ్ బచ్చన్ తరహా గట్స్ ని ఆలియా చూపిస్తోందని కీర్తినందుకుంటోంది. ఇక అమితాబ్ తరహాలోనే పవర్ ఫుల్ పాత్రలతో లేడీ అమితాబ్ గా మారిన విజయశాంతికి ఇప్పటివరకూ ఆ బిరుదు అలానే తన పేరిట ఉంది. ఇప్పుడు దానిని ఆలియా కైవశం చేసుకుందని భావించాలి. భారతదేశంలోనే వరుస పాన్ ఇండియా చిత్రాలతో ప్రయోగాత్మక పాత్రలతో ఏ ఇతర అగ్ర నాయికతో అయినా పోటీపడగల సత్తా తనకు ఉందని నిరూపిస్తోంది ఆలియా. ఈ భామ నటించిన ఆర్.ఆర్.ఆర్ తో పాటు గంగూభాయి విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. తొలిగా గంగూబాయి కతియావాడి విడుదల కోసం ఆలియా ఎదురుచూస్తోంది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫిబ్రవరి 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ఆలియా ఈ సినిమా ప్రమోషన్స్ లో బిజీగా ఉంది. ప్రమోషనల్ ఈవెంట్ లో ఆలియా వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. గంగూబాయి తన కెరీర్ లో ఇప్పటివరకు పోషించిన అత్యంత ఛాలెంజింగ్ క్యారెక్టర్ లలో ఒకటి. కమర్షియల్ ప్రేక్షకులను మెప్పించేలా సినిమా కంటెంట్ వినోదాత్మకంగా ఉండాలని పేర్కొంది. కాబట్టి ఆమె అదే సమయంలో ప్రయోగాత్మక పాత్రలో ఒదిగి నటించానని అందులోనే ఎంటర్ టైన్ మెంట్ ని ఇవ్వగలిగానని ఆలియా చెబుతోంది. ప్రజలు తనను ఇప్పుడు '4 అడుగుల అమితాబ్' అని 'లేడీ అమితాబ్' అని పిలుస్తున్నారని అలియా తెలిపింది.

# తమిళనాడు కవల క్రికెటర్ల సరికొత్త చరిత్ర.. ఒకే ఇన్నింగ్స్‌లో..




రంజీ ట్రోఫీ-2022 టోర్నీలో భాగంగా సరికొత్త రికార్డు నమోదైంది. ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో తమిళనాడు కవల సోదరులు బాబా అపరాజిత్, బాబా ఇంద్రజిత్ చరిత్ర సృష్టించారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో ఇద్దరూ సెంచరీ సాధించి అరుదైన ఫీట్ నమోదు చేశారు. తద్వారా క్రికెట్ రికార్డు బుక్‌లో తమ పేరు లిఖించుకున్నారు. కాగా ఎలైట్ గ్రూపు హెచ్‌లో భాగంగా గువాహటి వేదికగా తమిళనాడు- ఛత్తీస్‌గఢ్ జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తమిళనాడు జట్టుకు ఓపెనర్లు కౌశిక్ గాంధీ, లక్ష్మేష సూర్యప్రకాశ్ శుభారంభం అందించలేకపోయారు. ఈ క్రమంలో వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన బాబా అపరాజిత్ 267 బంతులు ఎదుర్కొని 166 పరుగులు చేశాడు. ఇందులో 15 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి. ఇక నాలుగో స్థానంలో క్రీజులోకి వచ్చిన బాబా ఇంద్రజిత్ 141 బంతుల్లో 21 ఫోర్ల సాయంతో 127 పరుగులు సాధించాడు. వీరిద్దరూ కలిసి 206 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలో అరుదైన రికార్డు వీరి సొంతమైంది. ఇక వీరిద్దరి అద్భుత ప్రదర్శనతో తమిళనాడు రెండో రోజు ఆటలో పటిష్ట స్థితికి చేరుకుంది. ఇన్నింగ్స్ బ్రేక్ సమయానికి 118 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 470 పరుగులు చేసింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**